ఇరుకు గదుల్లో ఇబ్బందులు

- భీమారం మండలంగా ఏర్పడి ఏడేళ్లు..
- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అవస్థలు
- తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, అధికారులు



జీపీ భవనంలో ఎంపీడీవో కార్యాలయం



భీమారంలోని తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

భీమారం: కొత్త జిల్లాలతో పాటు కొత్త మండలాలు ఏర్పాటు చేసి ఏడేళ్లు గడిచింది. కొత్త మండలాల ఏర్పాటు వల్ల పరిపాలన చేరువైనా, సౌకర్యాల కల్పనలో మాత్రం వెనుకంజ కొనసాగుతోంది. చెన్నూర్ నియోజకవర్గంలోని జైపూర్ మండలాన్ని విభజించి ఏడు గ్రామపంచాయతీలతో కొత్తగా 2016అక్టోబర్ 11న భీమారం కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేశారు. అయితే అప్పుడు కార్యాలయాల ఏర్పాటు కోసం అధికారులు హడావుడి చేసి పలు భవనాలు సేకరించి అందులో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో కాకుండా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను ప్రారంభించి చేతులు దులుపేసుకున్నారు. అయితే ఐదేళ్ల క్రితం పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.కోటి మంజూరయ్యాయి. దీంతో పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడగా జాతీయరహదారి పక్కనే పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని కేటాయించింది. అందులో పోలీస్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి అందులోనే పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తున్నారు. ఇక తహసీల్దార్ కార్యాలయం గతంలో సింగిల్ విండో పాత భవనంలో ఉండగా, అది శిథిలావస్థకి చేరుకోగా దానిని ఖాళీ చేసి గతంలో పోలీస్‌స్టేషన్ నిర్వహించిన అటవీశాఖ భవనంలోకి మార్చారు. అందులోనే రెండేళ్లుగా కొనసాగుతున్నా, ఇరుకుగదుల కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి గృహం కోసం నిర్మించిన దాంట్లో కార్యాలయం నడుస్తుండంతో 10మంది నిలబడలేని పరిస్థితి నెలకొంది. ఇక మండల పరిషత్ కార్యాలయాన్ని గ్రామపంచాయతీకి దాత చెర్కుసర్వోత్తం రెడ్డి విరాళంగా ఇచ్చిన భవనంలో నిర్వహిస్తున్నారు. అది కూడా సరిపోక నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 11గ్రామపంచాయతీల ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయానికి వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. అదేవిధంగా వ్యవసాయశాఖ కార్యాలయాన్ని కొన్నాళ్ల పాటు పాత జీసీసీ భవనంలో నిర్వహించిన అధికారులు, ఏవో బదిలీ కావడంతో ఐదేళ్ల నుంచి దానికి తాళం వేసి ఉంచుతున్నారు. రైతువేదిక నిర్మించడంతో ఏఈవో అందులో నుంచే విధులు నిర్వహిస్తున్నాడు. ఇప్పటివరకు మండలానికి రెగ్యులర్ ఏవోను కేటాయించకపోవడంతో కార్యాలయం వెలవెల పోతుంది.

రైతులపై ఇంత నిర్లక్ష్యమా...

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతులకు అండగా నిలుస్తున్నాం అని ప్రకటించుకుందే తప్పా.. ఆచరణలో పెట్టడం లేదు. భీమారం మండలంలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా పెట్టుకొని ప్రజలు జీవనోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మండలం ఏర్పడి ఏడు సంవత్సరాలు దాటినా, నేటికీ రైతులకు అండగా నిలిచేందుకు మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయడం లేదు. దీంతో రైతులు ఫర్టిలైజర్ షాపులకు వెళ్లి వారికి కావాల్సిన మందులు వారిని అడిగి కొనుగోలు చేస్తున్నారు. అదే మండల వ్యవసాయ కార్యాలయం ఉంటే రైతులకు ఎంతో ఉపయోగపడేది.

పట్టింపులేని రెవెన్యూ శాఖ...

మండల కేంద్రంలో తాత్కాలిక భవనంలో తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్న అధికారులు పోలీస్‌స్టేషన్ కోసం భూమి కేటాయించిన రెవెన్యూ అధికారులు తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ కోసం భవనం నిర్మించేందుకు ఇప్పటి వరకు భూమి కేటాయించలేదు. సొంత భవనం కోసం భూమి కేటాయింపు చేయడంలో ఇంత నిర్లక్ష్యమా అని ప్రజలు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఏనాడో భూమి కేటాయించే వారని పేర్కొంటున్నారు. ఇప్పుడు అటవీశాఖ అధికారులు ఒత్తిడి తెస్తే తహసీల్దార్ కార్యాలయం ఖాళీ చేయాల్సి ఉంటుంది. అప్పుడు ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు.

స్థల సేకరణ లేదు

మండలం ఏర్పాటు చేసి ఏడేళ్లు పూర్తయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించేందుకు స్థల సేకరణ కూడా చేయలేదు. ఏళ్ల తరబడి ఇరుకు గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఇబ్బంది పడుతున్నాం



భీమారంలోని ప్రభుత్వ కార్యాయాలకు భవనాలు లేక ఇరుకుగదుల్లో నిర్వహిస్తున్న కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నాం. తహసీల్దార్ కార్యాలయంలో నలుగురు నిలబడే అవకాశం లేదు. ఎంపీడీవో కార్యాలయం పరిస్థితి అలాగే ఉంది. ప్రభుత్వం చర్యలు తీసుకొని సొంత భవనాలు నిర్మించాలి.

– నాగభూషణ్ భీమారం

సొంత భవనాల నిర్మాణం కోసం కృషి



కొత్తగా ఏర్పడ్డ భీమారం మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసికెళ్తాను. రానున్న రోజుల్లో సొంత భవనాలు నిర్మిస్తాం.

– బుక్యా తిరుమల, జెడ్పీటీసీ భీమారం

క్లుప్తంగా

మల్లన్న పట్నాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాలలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు బోనాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. స్వామి వారికి భక్తులు తీపి పదార్థాలు వండి నైవేద్యంగా సమర్పించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రెబ్బెన: మండలంలోని వంకుల శివారులో బైక్ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఎల్లారి ఈశ్వర్ (20) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4న తాండూర్ మండలం కొత్తపెల్లికి చెందిన ఎల్లా రి ఈశ్వర్, స్నేహితులు బుర్స భీమే శ్, కలబోయిన శ్రావణ్‌లు కాగజ్‌నగర్‌లో ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా శ్రావణ్ బైక్‌ను నడుపగా వంకులం శివారులో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, ఈశ్వర్‌ను కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ్ వైద్యుల సూచన మే రకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు అక్కడి నుండి వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి బాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శ్రీక్రోధినామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. వైష్ణవ సంఘం శుభాకార్యక్రమాల నిర్వహణకు సంఘ భవనానికి సహాయ సహకారాలు అందించాలని కోరగా సముఖత వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో వైష్ణవ సంఘం అధ్యక్షుడు గోవర్ధనగిరి అనంతాచార్యులు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణాచార్యులు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణాచార్య, జిల్లా కోశాధికారి శ్రీనాథాచార్య, మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీలత, కార్యదర్శులు కృష్ణకాంతచార్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం పనిచేయక ఇబ్బందులు



పనిచేయని ఏటీఎం

భీమారం: మండలంలోని 11గ్రామ పంచాయతీలకు ఏకైక ఏటీఎం పనిచేయకపోవడంతో డబ్బుల కోసం వచ్చిన వారు ఆదివారం నిరాశతో వెనక్కివెళ్లారు. వారంలో కనీసం రెండు రోజుల పాటు ఏటీఎం పనిచేయడం లేదని ప్రజలు వాపోయారు. ఏటీఎంలో డబ్బులు రాక, మరోపక్క బ్యాంకుకి సెలవు రోజు కావడంతో నానా ఇబ్బందులు పడ్డారు. బ్యాంకు అధికారులు ఏటీఎం పనితీరుపై శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నధర్మారంలో క్షుద్ర పూజల కలకలం



కాసిపేట: మండలంలోని చిన్నధర్మారంలో ఓ ఇంటి ముందు కొబ్బరి కాయ, పసుపు కుంకుమ, నల్లతాడు, బొమ్మ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. కొందరు వ్యక్తులు కావాలని చేతబడి చేశారని కుటుంబ సభ్యులు దూషించడంతో గ్రామంలో కలవరం మొదలయింది. ఈ ఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. కాగా కొందరు యువకులు కావాలని ఈ పనికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కుల సంఘం నాయకులతో సమావేశం



గోమాస శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రిలోని శివసాయి ఫంక్షన్ హాల్లో ఆదివారం బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పలు కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణపై నిప్పులు చెరిగారు. కాకా వెంకటస్వామి కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమి లేదని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీలో ఉన్న తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కుల సంఘాల నాయకులు సన్మానించారు. సమావేశంలో నేతకాని, ఎమ్మార్పీఎస్ కుల సంఘాల నాయకులు ఉన్నారు.

ఆనంద నిలయానికి చేయూత



సరుకులు అందిస్తున్న ఎస్‌బీఐ బ్రాంచ్ నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఆనంద నిలయం అనాథ పిల్లలు, వృద్ధాశ్రమానికి హైదరాబాద్‌లోని కోటి బ్రాంచ్ ఎస్‌బీఐ బ్యాంకు రూ.75వేల విలువ గల నిత్యావసర సరుకులను, రూ.లక్ష విలువ గల రెండు కంప్యూటర్లను అందించారు. కార్యక్రమంలో మంచిర్యాల మెయిన్ ఎస్‌బీఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ అలోక్ శర్మ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, జిల్లా కోశాధికారి కే.సత్యపాల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, అనాథ, వృద్ధుల ఆశ్రమం ఇన్‌చార్జి బుద్దినేని సత్యనారాయణ రావు, కాసర్ల రంజిత్‌కుమార్, ఆశ్రమం కేర్ టేకర్ సదానందం పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్



లింగాలలో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

భీమిని: నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సై గంగారాం అన్నారు. కన్నెపల్లి మండలంలోని లింగాల గ్రామపంచాయతీలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ కుమారస్వామి, ఎస్సై గంగారాం ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు బృందాలుగా ప్రతీ ఇంట్లో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 20మోటారుసైకిళ్లు, రెండు ఆటోలు సీజ్ చేశారు. అనంతరం లింగాల గ్రామపంచాయతీలో ప్రజలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ప్రలోబాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎస్సై సంతోశ్‌కుమార్

కార్మిక కాలనీల్లో కార్డెన్ సెర్చ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కార్మిక కాలనీల్లో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శ్రీరాంపూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాకాలనీలో సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సంతోశ్‌కుమార్.. కాలనీలోని పలువురు ఇళ్లకు వెళ్లి అనుమానితుల వివరాలు తెలుసుకున్నారు. వాహనాలను తనిఖీ చేసి వాటి రిజిస్ట్రేషన్ ఇతర పత్రాలను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరుగడానికి పోలీసులకు సహకరించాలన్నారు. అపరిచత వ్యక్తులు, అనుమానితులు కాలనీల్లో సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలు



నస్పూర్: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

నస్పూర్: పట్టణ పరిధిలోని కృష్ణాకాలనీ, సీసీసీ, శ్రీరాంపూర్ అరుణక్కనగర్, అంబేద్కర్ కాలనీలతో పాటు పలు ఏరియాలలోని పోచమ్మ ఆలయాల వద్ద భక్తులు ఆదివారం పోచమ్మ బోనాలు సమర్పించారు. కోళ్లు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



పెద్దనపల్లి న్యూకాలనీలో...

కాసిపేట: మండలంలోని సోమగూడెం, కాసిపేట, ముత్యంపల్లి, దేవాపూర్ గ్రామాలలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కాలనీల్లో కలసికట్టుగా డప్పుచప్పుల్లతో పోచమ్మ ఆలయాలకు తరలివెళ్లి మేకలు, కోళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేముల కృష్ణ, గ్రామపెద్దలు వెంకన్న, కొత్త రమేష్, బన్న మల్లేష్, నర్సయ్య తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

అన్నదానం

కాసిపేట: మండలంలోని సోమగూడెం ట్యాంక్‌బస్తీలో ఆదివారం హనుమాన్ మాలధారణ చేసిన భక్తులకు, గ్రామస్తులకు సేవాలాల్ భక్తులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ భక్తులు అజ్మీర శ్రీనివాస్, భూక్య ప్రవీణ్, సపాట్ అశోక్, విజయ్, అంబదాస్, హరిచంద్ తదితరులున్నారు.

నియామకం

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామ బీజేపీ నూతన కమిటీని నియమించినట్లు మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు తెలిపారు. అధ్యక్షుడిగా గడ్డి విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కొడూరి గంగాధర్, ఉపాధ్యక్షులుగా తిరుమల సురేశ్, చుక్కన్న, కోశాధికారిగా ఎల్కుసి రవి, కార్యదర్శులుగా తిరుపతి, మల్లేశ్, సలహాదారులుగా మల్లేశ్, వెంకటేశ్, గోపాల్, సంగ వెంకటేశ్, సభ్యులుగా సుదర్శన్, గంగమల్లు, మల్లేశ్, శ్రీనివాస్, భూమన్నలను నియమించినట్లు తెలిపారు.

ఎంసీహెచ్ చుట్టూ చెత్తనే...



మంచిర్యాలటౌన్: పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం చుట్టూ చెత్త పేరుకుపోతోంది. ఆసుపత్రిలో ఉపయోగించిన బయోవేస్టేజ్‌ను ఆసుపత్రి వెనుకవైపున కుప్పలుగా పోస్తున్నారు. దానిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా, రోజుల తరబడి కుప్పలుగా పోసి ఉంచుతున్నారు. గతంలో బాలింతలకు వేసిన కుట్లు కేవలం పరిసరాల అపరిశుభ్రతతోనే మానకుండా ఉండిపోగా, ఇన్‌ఫెక్షన్లు సోకాయి. మరోసారి బాలింతలకు పేరుకుపోతున్న బయోవేస్టేజ్ చెత్తతో ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. ఆసుపత్రి చుట్టూ పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే వారు కోరుతున్నారు.

జైపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ

- పార్టీకి మండల అధ్యక్షుడితో పాటు ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు రాజీనామా



రాజీనామా చేసిన అధ్యక్షుడు అరవిందర్‌రావు, ఎంపీపీ రమాదేవిలక్ష్మణ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి

జైపూర్: మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయింది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు పెరుగుతున్నాయి. తాజాగా జైపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బల్మూరి అరవిందర్‌రావు ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్షులు గోదారి రమాదేవి–లక్ష్మణ్, పీఏసీఎస్ చైర్మన్ గుండు తిరుపతితో పాటు ఐదుగురు ఎంపీటీసీలు, 9 మంది మాజీ సర్పంచులతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. దుబ్బపల్లిలో పీఎల్ఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం సమావేశమైన వారు పార్టీకి రాజీనామా చేసినట్లుగా ప్రకటించారు. మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేయడంతో మండలంలో దాదాపుగా బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయింది. త్వరలో ఏ పార్టీలో చేరుతామన్న వారి నిర్ణయాన్ని ప్రటించనట్లుగా వారు పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యేలు



పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు




విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వినోద్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి గోల్ బంగ్లా బస్తీలో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్‌కు ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లీంలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత విందు ఆరగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కాంగ్రెస్ ప్రచార కమిటీ నాయకుడు నాతరి స్వామి, ముస్లిం వర్గాలు, కాంగ్రెస్ శ్రేణులు, పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం లేక సింగరేణి ఉద్యోగుల వెతలు

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులకు ఆర్టీసీ బస్ సర్వీసు కరువైంది. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్ కేంద్రంగా నిర్వహిస్తున్న బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది, బొగ్గు గనుల్లో విధులు నిర్వహించే కార్మికులు, సాధారణ పౌరులు బస్సు సౌకర్యం లేక నానా యాతన పడుతున్నారు. బెల్లంపల్లి నుంచి రోజువారీగా 50మందికిపైగా ఉద్యోగులు, సిబ్బంది జీఎం కార్యాలయానికి వెళ్లి విధులు నిర్వహిస్తుండగా అనేక మంది కార్మికులు బొగ్గు గనులు, విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరి సౌలభ్యం కోసం గతంలో బస్సు సర్వీసును మంచిర్యాల డిపో అధికారులు నడిపించగా, ఆ తర్వాత అర్ధంతరంగా రద్దు చేశారు. 2022 డిసెంబర్ 31నాటి వరకు నడిపించి బస్సు సర్వీసును నిలిపివేశారు. అప్పటి నుంచి కార్మికులు ఎండ, వానను లెక్క చేయకుండా అష్టకష్టాలు పడుతూ, ద్విచక్ర వాహనంపై రాకపోకలు చేస్తున్నారు. జాతీయ రహదారి మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో వేగంగా వెళ్తున్న వాహనాలతో తీవ్రంగా భయపడుతున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణం. ప్రైవేట్ వాహనాల్లో లేదా సహచర ఉద్యోగుల వాహనాలపై వెళ్లి విధులు నిర్వహించాల్సి వస్తోంది. కొందరు ఆర్టీసీ బస్సుల్లో గోలేటి క్రాస్ రోడ్ వరకు వెళ్లి అక్కడి నుంచి ఆటోల్లో జీఎం కార్యాలయానికి వెళ్తున్నారు. తద్వారా అధిక చార్జీని చెల్లించి నష్టపోతున్నారు. ఖైరిగూడ, డోర్లి ఓపెన్‌కాస్ట్ గనులకు వెళ్లే కార్మికులు మరిన్ని కష్టాలను అనుభవిస్తున్నారు. కాగా గోలేటి టౌన్‌షిప్ నుంచి అనేక మంది పౌరులు వివిధ అవసరాల కోసం బెల్లంపల్లికి దినాం వచ్చి పోతుంటారు. వీరికి సైతం బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్, సొంత వాహనాల్లో రాకపోకలు సాగిస్తుండటం వల్ల ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సింగరేణి కార్మికులు, మహిళ ఉద్యోగులు, పౌరులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగుల సమయపాలనకు అనుగుణంగా బస్సు సర్వీసును నడిపించి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు. ఉద్యోగులు పడుతున్న ప్రయాణకష్టాలపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టిసారించి సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.



గోలేటి టౌన్‌షిప్‌కు నడిచిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది తరగతులలో మిగిలిన సీట్ల ప్రవేశం కోసం మోడల్ స్కూల్, కార్మెల్ స్కూల్, సింగరేణి హైస్కూళ్లలో ఆదివారం జరిగిన ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాలకు చిన్నారులను వారి తల్లిదండ్రులు సమయానికి తీసుకెళ్లి పరీక్షలు రాయించారు.

కోటపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆదర్శ పాఠశాలల ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ తుమ్మల లక్ష్మారెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి యోగేశ్వర్ తెలిపారు. 6వ తరగతి పరీక్షకు 50మంది విద్యార్థులు హాజరు కాగా 7, 8, 9, 10తరగతి ప్రవేశ పరీక్షకు 20మంది హాజరైనట్లు వివరించారు.

ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన హార్థిక్, కార్తీక్ అనే చిన్నారులు ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు. మందమర్రి మిత్రబృందం ఆధ్వర్యంలో సేకరించిన రూ.15వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం చిన్నారుల ఇంటికి వెళ్లి అందించారు.